క్లుప్తంగా

ఆర్టీసీ షాపుల టెండర్‌కు దరఖాస్తుల ఆహ్వానం

నర్సంపేట: నర్సంపేట డిపో పరిధిలోని ఆర్టీసీ బస్టాండ్‌ల్లోని షాపుల టెండర్‌కు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డిపో మేనేజర్ కె.ప్రసూన లక్ష్మి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నర్సంపేట బస్టాండ్‌లో 8, నెక్కొండలో 3, నల్లబెల్లిలో ఒకటి, గూడూరులో ఐదు షాపులకు అప్లికేషన్ ఫారం కోరుతున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన వ్యాపారస్తులు నర్సంపేట డిపో మేనేజర్ కార్యాలయంలో అప్లికేషన్ ఫారములు తీసుకుని జనవరి 2 వరకు దరఖాస్తు అందజేయవచ్చని తెలిపారు. అదే నెల 3న వరంగల్ ఆర్ఎం ఆఫీస్‌లో డ్రా తీస్తారని వివరించారు. ఈ అవకాశాన్ని వ్యాపారస్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మండల సభ వాయిదా

దుగ్గొండి: మండల పరిషత్ కార్యాలయంలో గురువారం జరగాల్సిన మండల సభను ఎంపీపీ కాట్ల కోమల వాయిదా వేశారు. మండల పరిషత్ కార్యాలయంలో సభ ప్రారంభం కాగానే ఈ మేరకు ఎంపీపీ ప్రకటించారు. ప్రజా పాలన కార్యక్రమ నేపథ్యంలో అధికారులు హాజరు కాని పరిస్థితుల్లో మరో వారం రోజుల్లో సభను ఏర్పాటు చేసుకోవాలనే ఎంపీటీసీ తీర్మాణం మేరకు సభను వాయిదా వేసినట్లు ఎంపీపీ తెలిపారు.

కాంగ్రెస్‌లో బీఆర్ఎస్ శ్రేణుల చేరిక



నెక్కొండ: మండలంలోని బంజరుపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు టీపీసీసీ సభ్యుడు సొంటిరెడ్డి రంజిత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో గురువారం చేరారు. ఈ సందర్భంగా గ్రామంలో గురువారం జరిగిన ముఖ్యకార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో అనతి కాలంలో అమలవుతున్న సంక్షేమ, అభివృద్ధి ఫలాలకు ఆకర్షితులై చేరుతున్నారని తెలిపారు. అనంతరం పార్టీలో చేరిన మోహన్, సుధాకర్, లింగయ్య, హరీశ్, రమేశ్, అనిల్‌కుమార్, శ్రావణ్, రాజ్‌కుమార్, వెంకటయ్య, తదితరులకు కండవా కప్పి పార్టీలోకి స్వాగతించారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో దంపతులకు గాయాలు



ఖానాపురం: రోడ్డు ప్రమాదంలో దంపతులకు గాయాలైన ఘటన మండలంలోని అశోక్‌నగర్‌లో గురువారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. కొత్తగూడ మండలంలోని చెరువుముందుతండాకు చెందిన నూనావత్ చిన్నరాజు తన ద్విచక్ర వాహనంపై భార్యతో కలిసి నర్సంపేటకు వచ్చి తిరిగి వెళ్తుండగా అశోక్‌నగర్ వద్ద ఎదురుగా వచ్చిన అశోక్ లేలాండ్ వాహనం వారి ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. దీంతో రాజు కుడికాలు విరిగింది. అతడి భార్యకు స్వల్పగాయాలయ్యాయి. స్థానికులు ఇద్దరినీ చికిత్స నిమిత్తం నర్సంపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు.

పరామర్శ



ఖానాపురం: మండలంలోని ధర్మరావుపేట గ్రామానికి చెందిన నద్దునూరి మల్లమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబాన్ని ఎంపీపీ వేములపల్లి ప్రకాశ్‌రావు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బత్తిని శ్రీనివాస్‌గౌడ్ గురువారం పరామర్శించారు. తొలుత మృతురాలి చిత్రపటానికి పూలమాలలు వేసి మృతురాలి కుటుంబ సభ్యులు నద్దునూరి కోటయ్యతో పాటు కుమారులను ఓదార్చారు. పరామర్శించిన వారిలో రాజేశ్, కేఎస్.చారి, చెల్లూరి శ్రీనివాస్, హన్మంతరావు, దేవేందర్‌రావు, వెన్ను పూర్ణచందర్, వాసు, సురేందర్, బూడిద శ్రీనివాస్, ముంజాల శ్రీనివాస్, వాసు, రామకృష్ణ, తిరుపతిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా మొరం తరలిస్తే చర్యలు

దామెర: మొరం అక్రమంగా తరలిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్సై కొంక అశోక్ స్పష్టం చేశారు. మండలంలోని ఊరుగొండ సమీపంలో పసరుగొండ శివారు నుంచి అక్రమంగా మొరం తరలిస్తున్న ఒక టిప్పర్, ట్రాక్టర్, జేసీబీని స్వాధీనం చేసుకుని యజమానులు ఓర్సు సమ్మయ్య, ఒడిదోలు మల్లయ్యపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.



నెక్కొండ : మాట్లాడుతున్న ఉషాదయాళ్



రాయపర్తి : దరఖాస్తు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే



రాయపర్తి: సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

ఆరు గ్యారంటీలతో సమగ్రాభివృద్ధి

● ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి

రాయపర్తి: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీలతో పేదల సమగ్రాభివృద్ధి జరుగుతుందని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి తెలిపారు. మండలంలోని జయరాంతండా (ఎస్), బాల్‌నాయక్‌తండా, జగన్నాధపల్లి, దుబ్బతండా, పన్యానాయక్‌తండా, కిష్టాపురం, ఆరెగూడెం, జింకురాంతండాల్లో ప్రజా పాలన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా జయరాంతండా (ఎస్)లో కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. పేదల సమగ్రాభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం ఆరు గ్యారంటీల అమలుకు శ్రీకారం చుట్టిందన్నారు. లబ్ధిదారులను ఎంపిక చేయడంలో పారదర్శకత పాటించాలని, రాజకీయ పార్టీలకు అతీతంగా అర్హులందరికీ గ్యారంటీలు అందేలా చూడాలని అధికారులకు, ప్రజాప్రతినిధులకు స్పష్టం చేశారు. అర్హులందరికీ పథకాలు అమలవుతాయని తెలిపారు. ప్రజలు దళారులను నమ్మి మోసపోవద్దని కోరారు. కార్యక్రమాల్లో ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి, జెడ్పీటీసీ రంగు కుమార్‌గౌడ్, సర్పంచ్ పద్మ రవి, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ గుగులోతు కిషన్, ఎంపీఓ రామ్మోహన్, ఏపీఎం కిరణ్‌కుమార్, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

దరఖాస్తుల స్వీకరణలో నిర్లక్ష్యం వద్దు

ఖానాపురం: ప్రజల దరఖాస్తులను స్వీకరించడంలో అధికారులు నిర్లక్ష్యం చేయొద్దని నర్సంపేట ఆర్డీఓ కృష్ణవేణి స్పష్టం చేశారు. మండలంలోని భద్రుతండ, వేపచెట్టుతండ, నాజీతండ, కొడ్తిమాటుతండా గ్రామాల్లో నిర్వహించిన సభల్లో అధికారులు ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. సభలను ఆర్డీఓ పరిశీలించి అధికారులకు దిశానిర్దేశం చేశారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడారు. నర్సంపేట వ్యాప్తంగా 23 గ్రామాలతోపాటు మున్సిపాలిటీ పరిధిలోనూ ప్రజాపాలన దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమాల్లో ఎంపీడీఓ సుమవాణి, ఎంపీఓ రవి, ఏపీఎం సుధాకర్, ఏఓ శ్రీనివాస్, ఏఈ సంపత్, తదితరులు పాల్గొన్నారు.



పర్వతగిరి : నారాయణపురంలో..

నెక్కొండ: మండలంలోని 8 గ్రామాల్లో సభలు నిర్వహించగా పనికరలో మండల ప్రత్యేక అధికారి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఉషా దయాళ్ పాల్గొని అభయహస్తం దరఖాస్తుల వివరాలు వెల్ల డించారు. తొలుత ఆమె ముందుగా సీఎం రేవంత్‌రెడ్డి సందేశాన్ని చదివి వినిపించారు. అనంతరం ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాసరావు, తహసీల్దార్ రాజ్‌కుమార్, ఎస్సై జానీపాషా, ఎంపీఓ పర్వీన్ కౌసర్, ఏఓ నాగరాజు, ఏపీఎం శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

సంగెం: మండలంలోని కృష్ణానగర్, పోచమ్మతండ, వీఆర్ఎన్ తండ, గొల్లపల్లి, బాలునాయక్ తండాల్లో గ్రామ సభలు నిర్వహించారు. మొత్తం 268 దరఖాస్తులు వచ్చినట్లు ఎంపీడీఓ రవీందర్ తెలిపారు. వీఆర్ఎన్ తండ, పోచమ్మతండలను డీఆర్‌డీఓ ఎం.సంపత్‌రావు, మండల ప్రత్యేకాధికారి రవీందర్, కృష్ణానగర్, వీఆర్ఎన్ తండలను ఏసీపీ సతీశ్‌బాబు పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఎంపీపీ కళావతి, జెడ్పీటీసీ సుదర్శన్‌రెడ్డి, సర్పంచ్‌లు మోహన్, రమాదేవి, బుచ్చనాయక్, మల్లేశం, రజని, తహసీల్దార్ రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పర్వతగిరి: మండలంలోని మాల్యతండా, భట్టుతండా, రోళ్లకల్, నారాయణపురం, శ్రీనగర్, మూడెత్తులతండా, రావూరు, మోత్యతండాల్లో అధికారులు దరఖాస్తులను స్వీకరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సంతోశ్‌కుమార్, ఏపీఓ సుశీల్‌కుమార్, ఏఓ ప్రశాంత్, మండల ప్రత్యేక అధికారి సంజీవరెడ్డి, ఎంపీఓ శ్రీనివాస్, తహసీల్దార్ వెంకటస్వామి, తదితరులు పాల్గొనగా ఎస్సై వీరభద్రరావు పర్యవేక్షించారు.



నల్లబెల్లిలో..



సంగెం : వీఆర్ఎన్ తండాలో..

నల్లబెల్లి: మండలంలోని దస్తగిరిపల్లి, అర్షనపల్లి, మామిండ్లవీరయ్యపల్లి, దర్మరావుపల్లి, అర్వయ్యపల్లి, మేడపల్లి గ్రామాల్లో సభలు జరిగాయి. సభలను మండల ప్రత్యేకాధికారి భాగ్యలక్ష్మి, నర్సంపేట ఏడీఏ శ్రీనివాస్ పర్యవేక్షించారు. స్థానిక వైద్యాధికారి ఆచార్య పర్యవేక్షణలో వైద్య సేవలు అందించారు.

హామీలను నెరవేర్చాలి

ప్రజా పాలన కార్యక్రమం దరఖాస్తులకే పరిమితం కాకుండా ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ఎంపీపీ ఊడుగుల సునీత అన్నారు. దస్తగిరిపల్లిలో నిర్వహించిన సభలో ఆమె మాట్లాడారు. కార్యక్రమాల్లో తహసీల్దార్ రాజేశ్, ఎంపీడీఓ విజయ్‌కుమార్, ఎంపీఓ కూచన ప్రకాశ్, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు మాలోత్ రమేశ్, మండల అధ్యక్షుడు చిట్యాల తిరుపతిరెడ్డి, సర్పంచ్‌లు శ్రీలత, సృజన, లసుమమ్మ, మమత, అమరేందర్, తిరుపతి, ఎంపీటీసీ శ్రీలత, లచ్చమ్మ తదిరతులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న పుష్కర కుంభాభిషేకం



విగ్రహాలకు అభిషేకం చేస్తున్న అర్చకులు



హోమం చేస్తున్న అర్చకులు, భక్తులు

నర్సంపేట: నర్సంపేటలోని శ్రీధర్మశాస్త్రా అయ్యప్ప స్వామి ఆలయంలో చైర్మన్ శింగిరికొండ మాధవ శంకర్‌గుప్తా ఆధ్వర్యంలో 23వ మండల పూజా మహోత్సవం, ద్వితీయ పుష్కర కుంభాభిషేకం రెండో రోజు కార్యక్రమాలు గురువారం కొనసాగాయి. వేద పండితులు సి.వెంకటేశ్ శర్మ ఆధ్వర్యంలో యాగశాలలో హోమపూజలు నిర్వహించారు. పడిమెట్ల ముందు అయ్యప్పస్వామి, ఆంజనేయస్వామి పంచలోహ విగ్రహాలకు అభిషేకాలు, పూజలు చేశారు. అనంతరం డాక్టర్ అంద్రు రాజేంద్రప్రసాద్ రెడ్డి వనజ, మిట్టపల్లి జగ్గారావు అత్తమ్మ, కోడిపెల్లి దామోదర్‌రావు స్వరూప, కొన్నేరు రాజ్‌కుమార్, చంద్రకళ, సింగిరికొండ మహాన అన్నపూర్ణ అయ్యప్పస్వాములు, భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో మాదారపు చంద్రశేఖర్‌గుప్తా, దొడ్డ రవీందర్, శ్రీరాం ఈశ్వరయ్య, కమలాకర్‌రెడ్డి, శంకరయ్య, లక్ష్మినారాయణ, శింగిరికొండ వేణుగోపాల్, పాలకుర్తి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రులు పిల్లలను బడికి పంపాలి

చెన్నారావుపేట: తల్లిదండ్రులు పిల్లలను తప్పనిసరిగా బడికి పంపాలని మండల కేంద్రంలోని ప్రభుత్వ హైస్కూల్ హెచ్ఎం పాపయ్య కోరారు. బడి బయట ఉన్న విద్యార్థులపై సీఆర్పీలు సంపత్, స్వామి గురువారం సర్వే నిర్వహించారు. మండలంలోని జల్లి కాలనీలో బడికి వెళ్లకుండా ఇంటి దగ్గరే ఉంటున్న కాట్రల చరణ్, పొన్నాల రాములను సీఆర్పీలు గుర్తించి కౌన్సెలింగ్ ఇచ్చి సమీపంలో ఉన్న మండల కేంద్రంలోని హైస్కూల్‌లో చేర్చారు. ఈ సందర్భంగా హెచ్ఎం పాపమ్మ మాట్లాడారు. విద్యార్థులు రెగ్యులర్‌గా పాఠశాలకు వెళ్లేలా తల్లిదండ్రులు బాధ్యత వహించాలని సూచించారు. విద్యార్థులు పాఠశాలలో జాయిన్ కావడానికి పోలీస్ కానిస్టేబుల్ క్రాంతికుమార్ సహకరించి కౌన్సెలింగ్ ఇచ్చారని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఉమాదేవి, శ్రీనివాస్‌రెడ్డి, అనుపమ, నిర్మలాదేవి, ఆఫీస్ స్టాఫ్ రంజిత్, స్వర్ణలత, సీఆర్పీలు సంపత్, స్వామి, తదితరులు పాల్గొన్నారు.



బడిలో చేర్పించిన విద్యార్థులతో సీఆర్పీలు, హెచ్ఎం

'లోక్‌సభ స్థానాన్ని మహిళలకు కేటాయించాలి'

వర్ధన్నపేట: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో వరంగల్ లోక్‌సభ స్థానాన్ని మహిళలకు కేటాయించాలని తెలంగాణ బీసీ బహుజన సంక్షేమ సంఘం వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు ప్రతాపగిరి విజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. పట్టణ కేంద్రంలో బర్కం రామ్మోహన్ అధ్యక్షతన గురువారం నిర్వహించిన సమావేశానికి ముఖ్యఅతిథిగా విజయ్‌కుమార్ హాజరై మాట్లాడారు. పార్లమెంట్‌లో మహిళలకు 34 శాతం రిజర్వేషన్ బిల్లు ఆమోదం పొందిన క్రమంలో దాన్ని రాబోయే పార్లమెంటరీ ఎన్నికల్లో అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వరంగల్ లోక్‌సభ టికెట్ కూరాకుల భారతికి కేటాయించాలని కాంగ్రెస్ అధిష్టానాన్ని కోరారు. సమావేశంలో నాయకులు సింగార రవి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న విజయ్‌కుమార్

నేరాల నివారణలో ప్రజలు కీలకం

పర్వతగిరి: నేరాల నివారణలో ప్రజలు కీలకమని ఎస్సై వీరభద్రరావు తెలిపారు. మండలంలోని నారాయణపురంలో గురువారం ఏర్పాటు ఏర్పాటు చేసిన జాగృతి పోలీసు కళాజాత కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. ప్రజలు బాల్య వివాహాలు, మానవ అక్రమ రవాణా, నిషేధిత మత్తు పదార్థాల విక్రయాలు, సైబర్ నేరాలు, మూఢనమ్మకాలు, తదితరాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. ప్రజలను చైతన్యవంతం చేసే దిశగా కళాజాత కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. నేరాలను నివారించడంలో పోలీసులకు ప్రజలు సహకరించాలని ఆకాంక్షించారు. బాల్య వివాహాలు, మానవ అక్రమ రవాణా, తదితరాలపై పోలీసులకు సమాచారం అందించాలని చెప్పారు. ప్రజలు ఇచ్చే సమాచారం, సహకారంతో నేరాలను పూర్తిగా నివారించగలమని స్పష్టం చేశారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో కళాజాత బృందం పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్సై వీరభద్రరావు

రాష్ట్రస్థాయి జూడో పోటీలకు ఎంపిక

వర్ధన్నపేట: మండలంలోని ఉప్పరపల్లి గ్రామంలోని జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు రాష్ట్రస్థాయి జూడో పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం ఏ.వేణు తెలిపారు. ఎంపికైన విద్యార్థులను పాఠశాల ఆవరణలో హెచ్ఎం వేణు, ఉపాధ్యాయులు ఉషారాణి, శ్రీదేవి, రాజు, లింగమూర్తి, విజయ్, ఎం రాజు, అరుణాదేవి, వీరస్వామి, జావిద్ గురువారం అభినందించారు. ఈ సందర్భంగా హెచ్ఎం వేణు మాట్లాడారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో వరంగల్‌లోని గురువారం నిర్వహించిన ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి జూడో అండర్-17 సెలక్షన్స్‌లో జిల్లాస్థాయిలో ఏ.అనిత 40 కేజీల విభాగంలో మొదటిస్థానంలో నిలవగా, బి.శిరి 63 కేజీల విభాగంలో మొదటిస్థానంలో నిలిచారని తెలిపారు. ఈనెల 29 నుంచి 31 వరకు కరీంనగర్‌లో జరుగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో విద్యార్థులు పాల్గొంటారని చెప్పారు.



పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేయండి

వర్ధన్నపేట: అంగన్‌వాడీ కేంద్రాలను ఐసీడీఎస్ అధికారులు తరచూ తనిఖీ చేయాలని ఎంపీపీ అన్నమనేని అప్పారావు ఆకాంక్షించారు. స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఆయన అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం గురువారం నిర్వహించారు. పలు గ్రామాల్లో అదనపు విద్యుత్ స్తంబాలు, లైన్లు లేక అవస్థ పడుతున్నట్లు పలువురు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు సభ దృష్టికి తీసుకొచ్చారు. అలాగే అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు, బాలింతలకు పంపిణీ చేయాల్సిన గుడ్లు పక్కదారి పడుతున్నాయని సర్పంచ్‌లు ఆరోపించారు. గుడ్లు పక్కదారి పట్టడంపై ఎంపీపీ అప్పారావు అసహనం వ్యక్తం చేశారు. ఐసీడీఎస్ అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. అధికారులు పట్టించుకోకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సంబంధిత శాఖల అధికారులు మూడు నెలల ప్రగతి నివేదికను వివరించారు. సమావేశంలో ఎంపీడీఓ రాజ్యలక్ష్మి, వైస్ ఎంపీపీ చొప్పరి సోమలక్ష్మి, జెడ్పీటీసీ మార్గం భిక్షపతి, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న ఎంపీపీ అప్పారావు

పోటీ పరీక్షల పుస్తకాల పంపిణీ

దుగ్గొండి: మండలంలోని తిమ్మంపేటలో ముదిరాజ్ కులానికి చెందిన విద్యార్థులకు ముదిరాజ్ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (మెపా) ఆధ్వర్యంలో రూ.15 వేల విలువైన పోటీ పరీక్షల పుస్తకాలను గురువారం అందజేశారు. ఈ సందర్భంగా మెపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పులి దేవేందర్ మాట్లాడారు. చదువుల్లో రాణిస్తే సమాజంలో ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని చెప్పారు. ముదిరాజ్ విద్యార్థులు మెటీరియల్‌ను వినియోగించుకుని పోటీ పరీక్షల్లో ప్రతిభ చాటి ఇతరులకు ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో చొప్పరి శోభన్, దండు రాజు, మేక నవీన్, దండు చిరంజీవి, దండు చిరంజీవి, దండు రవి, ప్రభాకర్, శ్రీనివాస్, కరుణాకర్ పాల్గొన్నారు.



పుస్తకాలు పంపిణీ చేస్తున్న దేవేందర్, తదితరులు

టెన్త్ విద్యార్థులకు ఆల్ ఇన్ వన్..

మండల కేంద్రంలోని ప్రభుత్వ హైస్కూల్‌లో 10వ తరగతి చదువుతున్న 49 మంది విద్యార్థులకు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఆల్ ఇన్ వన్ పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం ఎలగొండ రామస్వామి, పీఆర్టీయూ మండల అధ్యక్షుడు పరుపాటి సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

కాంగ్రెస్ హయాంలోనే సుపరిపాలన



రాయపర్తి : జెండా ఆవిష్కరిస్తున్న హామ్యానాయక్



వర్ధన్నపేట: జెండా ఆవిష్కరిస్తున్న వరదరాజేశ్వర్‌రావు



నర్సంపేట: జెండా ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే దొంతి

● ఆవిర్భావ వేడుకల్లో ఎమ్మెల్యే మాధవరెడ్డి

నర్సంపేట: కాంగ్రెస్ హయాంలోనే ప్రజలకు సుపరిపాలన సాధ్యమని స్థానిక ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి తెలిపారు. నర్సంపేట నియోజకవర్గవ్యాప్తంగా ఆ పార్టీ 139వ ఆవిర్భావ వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే మాధవరెడ్డి జెండా ఆవిష్కరించి మాట్లాడారు. పార్టీ ఆవిర్భావం నుంచి పేదల కోసం అనేక సంక్షేమ పథకాలు తీసుకొచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు పెండెం రామానంద్, నియోజకవర్గ కన్వీనర్ తక్కళ్లపల్లి రవీందర్‌రావు, పట్టణ అధ్యక్షుడు రాజేందర్, మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ సాంబయ్యగౌడ్ పాల్గొన్నారు.

వర్ధన్నపేట: పట్టణ కేంద్రంలో పార్టీ జెండాను ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎర్రబెల్లి వరద రాజేశ్వర్‌రావు ఆవిష్కరించి మాట్లాడారు. పలు గ్రామాల్లో స్థానిక కమిటీల అధ్యక్షులు జెండాలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఓబీసీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు వడ్లకొండ ఎల్లాగౌడ్, నాయకులు చిదురాల కుమారస్వామి, అఫ్సర్, తదితరులు పాల్గొన్నారు.

నెక్కొండ: మండల కేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్‌లో పార్టీ జాతీయ నేత సోనియాగాంధీ ఫ్లెక్సీకి శ్రేణులు పాలాభిషేకం చేశారు. అనంతరం టీపీసీసీ సభ్యుడు సొంటిరెడ్డి రంజిత్‌రెడ్డి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వంతోనే అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందుతాయని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి హరీశ్‌రెడ్డి, మండల, పట్టణ అధ్యక్షులు అశోక్, హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



పర్వతగిరి : సీనియర్ నాయకుడు హేమ్లానాయక్‌ను సన్మానిస్తున్న శ్రేణులు



నెక్కొండ: సోనియాగాంధీ ఫ్లెక్సీకి పాలాభిషేకం చేస్తున్న నాయకులు



చెన్నారావుపేట: జెండా ఆవిష్కరిస్తున్న గోపాల్



సంగెం : జెండా ఆవిష్కరిస్తున్న మాధవరెడ్డి

రాయపర్తి: మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జాటోతు హామ్యానాయక్, గ్రామ కమిటీ ఆధ్వర్యంలో అధ్యక్షుడు మచ్చ రమేశ్ జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మహమూద్, నాయకులు అఫ్రోజ్‌ఖాన్, కుంట రమేష్, సోడెపు శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

చెన్నారావుపేట: మండల కేంద్రంలోని కార్యాలయ ఆవరణలో పార్టీ మండల అధ్యక్షుడు భూక్యా గోపాల్‌నాయక్ జెండా ఆవిష్కరించి అరటి పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ బాదావత్ విజేందర్, పార్టీ జిల్లా కార్యదర్శి మొగిలి వెంకటరెడ్డి, సర్పంచ్‌లు సిద్దన రమేశ్, తప్పెట రమేశ్, తొగరు చెన్నారెడ్డి, ఇంద్రసేనారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సంగెం: మండలంలోని సంగెం, ఇతర గ్రామాల్లో పార్టీ జెండాను నాయకులు ఆవిష్కరించి కేక్ కట్ చేసి పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు చొల్లేటి మాధవరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ మెట్టుపల్లి రమేశ్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఆగపాటి రాజు తదితరులు పాల్గొన్నారు.


పర్వతగిరి: మండల కేంద్రంలోని కార్యాలయంలో పార్టీ మండల అధ్యక్షుడు జాటోతు శ్రీనివాస్‌నాయక్ జెండాను ఆవిష్కరించారు. అనంతరం సీనియర్ నాయకుడు హేమ్లానాయక్‌ను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ బొట్ల మహేంద్ర, జిల్లా ఉపాధ్యక్షుడు అనిల్‌రావు, సొసైటీ డైరెక్టర్ గంగాధర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

యువజనోత్సవాలకు ఆహ్వానం

వర్ధన్నపేట: మండలంలోని నల్లబెల్లి గ్రామానికి చెందిన జాతీయ యువజన అవార్డు గ్రహీత జక్కి శ్రీకాంత్‌కు 27వ జాతీయ యువజనోత్సవాలకు ఆహ్వానం అందింది. భారత ప్రభుత్వ యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో జనవరి 12 నుంచి 16 వరకు మహారాష్ట్రలోని నాసిక్‌లో 27వ జాతీయ యువజనోత్సవాలు నిర్వహించనుంది. తనకు ఆహ్వానం అందినట్లు శ్రీకాంత్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం జనవరి 5, 6 తేదీల్లో హైదరాబాద్‌లో తలపెట్టిన రాష్ట్ర యువజనోత్సవాలకు సైతం ఆహ్వానం అందినట్లు చెప్పారు. భారత ప్రభుత్వం తెలంగాణ నుంచి ఇద్దరికి ఆహ్వానం పంపగా తనకు అవకాశం రావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

పాఠశాలకు బెంచీల బహూకరణ

చెన్నారావుపేట: మండలంలోని జల్లి కాలనీలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు హనుమకొండకు చెందిన బెస్ట్ రన్నర్స్ ఆర్గనైజేషన్ సంస్థ చైర్మన్ తోట రఘు సహకారంతో సభ్యురాలు ఉమ గురువారం బెంచీలను బహూకరించారు. ఈ సందర్భంగా మండల నోడల్ ఆఫీసర్ బైరి సరళ మాట్లాడారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉత్తమ ఫలితాలు సాధించి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. సంస్థ ప్రతినిధి ఉమ మాట్లాడుతూ విద్యార్థులు అవసరమైన సదుపాయాలు కల్పించడంలో సంస్థ సహకారం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎం ఎం.పాపమ్మ, హమీదబాను, ఉపాధ్యాయులు మాధురి, సరోజ, ఎస్ఎంసీ చైర్మన్ అశోక్, అంగన్‌వాడీ టీచర్ లక్ష్మిబాయి, సీఆర్పీలు సంపత్, స్వామి తదితరులు పాల్గొన్నారు.



బెంచీలను బహూకరిస్తున్న సభ్యురాలు ఉమ